క్లుప్తంగా

మెట్టమాంబకు ఘనంగా జలాభిషేకం



అభిషేక జలాలు ఊరేగిస్తున్న మహిళలు

పెందుర్తి: చింతలగ్రహారంలో కొలువుదీరిన మెట్టమాంబ వార్షిక పండగలో భాగంగా సోమవారం అమ్మవారికి విశేష జలాభిషేకం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని మహిళలు ఘటాలు, కలశాల ఊరేగింపు చేశారు. అనంతరం అభిషేకాలు జరిపి కుంకుమ పూజలు జరిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు మడకపాలెంలో దుర్గమాంబ పండగ



దుర్గమాంబ అమ్మవారు

పరవాడ: మండలంలోని కన్నూరు శివారు మడకపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబ అమ్మవారి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా కోరారు. పండగ సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగే భారీ అన్నసమారాధనలో భక్తులు పాల్గొని, అన్న ప్రసాదాన్ని స్వీకరించాల్సిందిగా కోరారు.

పీజీఆర్ఎస్‌కు 5 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పదే పదే వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. మరోసారి ఆ ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి జాబిలీహిల్స్‌లో కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరునికి సోమవారం రుద్రాభిషేకం జరిపించారు. మహాశివునికి ముందుగా అర్చనలు, విశేష పూజలు జరిపారు. అనంతరం రుద్రాభిషేకం నిర్వహించారు. భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, గొల్లవిల్లి వెంకటరావు, ప్రసాద్, జయ, శ్రీదేవి పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావుకు సత్కారం



శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును సత్కరిస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్

అగనంపూడి: పదవీ విరమణ పొందుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు సేవలు మరువలేనివని గాజువాక జోన్ ప్రజారోగ్యశాఖ సహాయ వైద్యాధికారి(ఏఎంహెచ్‌వో) కిరణ్‌కుమార్ అన్నారు. సుదీర్ఘకాలం జీవీఎంసీలో పనిచేసిన రామారావు ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో 85వ వార్డు పారిశుద్ధ్య కార్మికులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, గాజువాక జోన్‌లో పారిశుద్ధ్య నిర్వహణలో రామారావు చురుగ్గా ఉండేవారని, సిబ్బందికి, అధికారులకు వారధిలా పనిచేసేవారని కొనియాడారు. హుద్‌హుద్ తుపాను, కరోనా, విజయవాడ వరదల సమయంలో ఆయన అందించిన సేవలు అజరామరమన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బి.సీతారామయ్య, కోటేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు, వార్డు శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

మేహాద్రి కాలువ కబ్జా..!

చెరువులు మింగేస్తున్నారు.. గెడ్డలు పూడ్చేస్తున్నారు.. ప్రభుత్వ స్థలాలను చెరబడుతున్నారు.. బంజరు భూములను సొంతం చేసుకుంటున్నారు.. డి ఫారం భూములను లాక్కుంటున్నారు. ఇప్పుడు ఏకంగా మేహాద్రి రిజర్వాయర్‌కు చెందిన స్థలాలపైనే కన్నేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినది మొదలు.. పెందుర్తిలో టీడీపీ, జనసేన నాయకుల కబ్జాకాండకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఎక్కడికక్కడ అధికారులను భయపెట్టి, మచ్చిక చేసుకుని ఇష్టానుసారం కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌కు చెందిన ఓ కాలువను ఆక్రమించి.. తమ ప్రైవేట్ స్థలాలకు ఏకంగా రోడ్డే వేసేస్తున్నారు..!

- ప్రైవేట్ స్థలానికి రోడ్డు కోసం చింతగట్లలో టీడీపీ నాయకుల దురాక్రమణ
- నీటిపారుదల శాఖ అనుమతి లేకుండా రోడ్డు వేసిన వైనం
- భూకబ్జాలు, దురాక్రమణలతో రెచ్చిపోతున్న కూటమి నాయకులు



రోడ్డును పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ అధికారి



చింతగట్ల పంచాయతీలో మేహాద్రికి నీరందించే కాలువ స్థలంలో లేఅవుట్ కోసం టీడీపీ నాయకులు వేసిన రోడ్డు

పెందుర్తి: మండలంలోని చింతగట్ల టీడీపీ నాయకులు మేహాద్రిగెడ్డ భూమిని ఆక్రమిస్తున్నారు. గ్రామానికి సమీపంలోని తమ సొంత స్థలానికి రోడ్డు వేసేందుకు రిజర్వాయర్ భూమిని ఎంచుకున్నారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ అనుమతి లేకుండా తమ సొంత నిధులతో రోడ్డును వేయడం టీడీపీ దురాక్రమణకు పరాకాష్టగా నిలుస్తోంది. ఈ ఆక్రమణపై స్థానికులు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అధికార కూటమి బరితెగింపు

అధికారం వచ్చిన నుంచి చింతగట్లలో కూటమి నాయకుల దౌర్జన్యకాండ కొనసాగుతోంది. అధికారం తమ చేతుల్లో ఉంది.. తామేం చేసినా చెల్లుతుందన్న బరితెగింపును గ్రామంలో ప్రదర్శిస్తున్నారన్న ఆక్షేపణలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికే పాఠశాల స్థలాన్ని స్థానిక జనసేన నాయకులు కబ్జా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. ఇప్పుడు టీడీపీ నాయకులు తమ వంతుగా ఏకంగా మేహాద్రి రిజర్వాయర్‌కు చెందిన భూ భాగంలోని కాలువను ఇష్టానుసారం తవ్వేశారు. సర్వే నెంబర్ 9, 10, 12లలో ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించి సొంత నిధులతో తమ స్థలానికి వెళ్లేందుకు వీలుగా రోడ్డు వేస్తున్నారు. స్థానికులు అభ్యంతరం చెబితే మీ సంగతి చూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



నీటిపారుదల శాఖ అనుమతి లేకుండా మేహాద్రి భూ భాగంలో ఇష్టానుసారం తవ్విన టీడీపీ నాయకులు

ఈ కాలువ లేకపోతే గ్రామం మునకే!

టీడీపీ నాయకులు ఆక్రమించి రోడ్డు వేసిన కాలువ మేహాద్రి ఏర్పడిన నాటి నుంచి ఉంది. చింతగట్ల పంచాయతీలోని నందవరపువానిపాలెం, చింతగట్లలోని వర్షపు నీరు ఈ కాలువ ద్వారానే మేహాద్రిలో కలుస్తుంది. తాజాగా టీడీపీ నాయకుల దుశ్చర్య కారణంగా రాబోయే రోజుల్లో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ కాలువ పూడ్చేస్తే.. వర్షపు నీరు మేహాద్రికి వెళ్లే తావులేకుండా.. గ్రామంలోనే ఉండిపోతుంది. దీంతో ఇళ్లు, పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి టీడీపీ నాయకుల చెర నుంచి ఈ స్థలాన్ని కాపాడాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఇక్కడి మేహాద్రి కాలువపై చేపడుతున్న రోడ్డు నిర్మాణ విషయం మీద జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో ఆ స్థలాన్ని పరిశీలించాం. దీని నిర్మాణంపై ఎలాంటి అనుమతుల్లేవు. ఇక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– సుబ్బరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ

నిర్లక్ష్యం నీడన గాంధీ పార్కు



నిరుపయోగంగా మారిన మండల పరిషత్ ఆవరణలోని గాంధీ పార్కు



అధ్వాన స్థితిలో ఉన్న పార్కులోని వాకింగ్ ట్రాక్, గార్డెన్

సబ్బవరం: స్థానిక మండల పరిషత్ ఆవరణలోని మహాత్మా గాంధీ పార్కు సరైన నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారింది. మండల పరిషత్ ఆవరణలో పలు ప్రభుత్వ కార్యాలయాలు మండల విద్యా శాఖ, వ్యవసాయ శాఖ, ఇంజినీరింగ్, వెలుగు, మాతా శిశు సంక్షేమ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్, ఇరిగేషన్ తదితర కార్యాలయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండల పరిషత్ ఆవరణలోని ఈ పార్కు గతంలో సుందరీకరించడంతో ఇక్కడికి వివిధ అవసరాల నిమిత్తం వచ్చేవారికి ఎంతో ఆహ్లాదాన్ని పంచేది. అధికారుల కోసం నిరీక్షించేవారికి పార్కులో ఉండే బెంచీలు, పచ్చని చెట్ల చల్లని నీడ సేదతీర్చేది. ప్రస్తుతం ఈ పార్కు తీవ్ర నిర్లక్ష్యానికి గురై, శిథిల స్థితిని తలపిస్తోంది. మండలానికి చెందిన అన్ని రకాల కార్యాలయాలు ఇక్కడే ఉన్నా.. ఈ పార్కును పట్టించుకునే తీరిక మాత్రం వీరికి లేకుండా పోయింది. ఇప్పటికైనా ఈ పార్కును మునుపటిలా తీర్చిదిద్దాలని ఇక్కడి వచ్చే ప్రజలు కోరుతున్నారు.

‘మేడేని జయప్రదం చేయాలి’



సమావేశంలో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే)ను జయప్రదం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. పరవాడలో సిటు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మేడే సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల ప్రాణ త్యాగాలతో 8 గంటల పనివేళల్ని సాధించారని తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణతో పాటు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను దొంగచాటుగా నాలుగు లేబర్ కోడ్‌ల కింద మార్చి, వాటిని అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశంలో అన్ని కార్మిక, రైతు సంఘాలు మే 20న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ చట్టం అమలు జరిగితే ఇప్పుడున్న కార్మిక హక్కులు ఉండవని, ప్రైవేటీకరణ, కాంట్రాక్టు పద్ధతిలో అతి తక్కువ జీతాలతో పనిచేయడం, పని భద్రత లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మేడేపై రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో సిటు జిల్లా నాయకులు వి.వి.రమణ, ఎం.సంతోష్‌కుమార్, వై.బాబూరావు, ఆర్.శంకర్రావు, పెంటారావు, పైడిరాజు, రాజు పాల్గొన్నారు.

పాలిసెట్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



పాలిటెక్నిక్ కళాశాల సిబ్బందితో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: పాలిటెక్నిక్ ప్రవేశాల కోసం నిర్వహించనున్న పాలిసెట్–2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ అన్నారు. పరీక్ష నిర్వహణపై సోమవారం సమీక్ష జరిపారు. పెందుర్తి పరిధిలో ఆర్ఆర్ వెంకటాపురంలోని ఎస్‌వీఎల్ఎన్‌వీపీ జూనియర్ కళాశాల, పినగాడిలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాల, చినముషిడివాడలోని ఎస్ఆర్‌ఐ ఇండియన్ స్ప్రింగ్స్, పెందుర్తిలోని ఆదర్శ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ నెల 30న పాలిసెట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 2,632 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న పరీక్షకు అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సింహాచలం దేవస్థానంలో చందనోత్సవం అదే రోజు జరుగుతున్న నేపథ్యంలో అభ్యర్థులకు పైసమయం సూచించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కోసం ఆరుగురు అబ్జర్వర్లు, ఇద్దరు రూట్ అధికారులను నియమించామన్నారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అబ్జర్వర్లు, రూట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం



ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: కార్యరూపం దాల్చని ప్రైవేటు పరిశ్రమ కోసం క్యాప్టివ్ పోర్టు నిర్మాణం, సొంత ఐరన్ ఓర్ గనులకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవడం సిగ్గు చేటని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు అన్నారు. ఈ వ్యవహారం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టంగా తెలుస్తోందని ఆయన విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు, వేతన బకాయిలు, హెచ్ఆర్ఏ పునరుద్ధరణ, కరెంటు చార్జీల తగ్గింపు తదితర అంశాలపై స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12. 30 గంటల వరకు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీహెచ్. నర్సింగరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను నష్టపరుస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం దానికి మద్దతు ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి అంటే స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటూ, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించి రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలతో ప్రతిఘటిస్తామని ఆయన హెచ్చరించారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ , ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ, కార్మికులకు రావాల్సిన జీతాలు సక్రమంగా ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని అన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని, హెచ్ఆర్ఏను వెంటనే పునరుద్ధరించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్. రామారావు, కె.ఎం. శ్రీనివాస్, పి. శ్రీనివాసరాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ కార్యాచరణ

- మే 4న సబ్బవరంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి కార్యాలయం ప్రారంభం
- పరవాడ మండల కార్యకర్తల సమావేశంలో సమన్వయకర్త అదీప్‌రాజ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కార్యాచరణ ఉంటుందని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజలకు తెలిపి, వారిని చైతన్యపర్చడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమన్నారు.

సబ్బవరంలో మే 4న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ పాల్గొంటారని పేర్కొన్నారు. సబ్బవరంలో పార్టీ కార్యాలయం ప్రారంభించాక నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి పంచాయతీ నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు చుక్క రామునాయుడు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు వెన్నల సన్యాసిరావు, యూత్ అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్, ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ సదియా, పార్టీ సర్పంచ్‌లు పల్లా అప్పారావు నాగమణి, గొర్లి గోపి అమ్మలు, బొండా కనకారావు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు, పార్టీ నాయకులు అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సుందరపు అప్పారావు, గొన్నా హేమచంద్రనాయుడు, బురద రాజు, పల్లా గోవిందు, వెన్నల సింహాద్రి, ఉమా మహేశ్వరి, పాశిల దివ్య, మడక సూరిబాబు, ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో సీసీ డ్రైన్‌కు శంకుస్థాపన



సీసీ కాలువ శంకుస్థాపనలో పాల్గొన్న గ్రామ పెద్దలు

పరవాడ: స్థానిక సినిమాహాల్ కూడలిలో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రైన్ పనులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు, పరవాడ ఎంపీటీసీ–2 పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ డ్రైన్‌కు నిధులు మంజూరు చేసిన పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులు పూర్తయితే గ్రామస్తులకు మురుగు సమస్య నుంచి దాదాపుగా విముక్తి లభిస్తుందన్నారు. సీసీ డ్రైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను కోరారు. శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, బొద్దపు అయ్యబాబు, రెడ్డి నగేష్, బద్రి, వర్రి హరి, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం



వేసవి శిక్షణ శిబిరంలో పుస్తకాలను ప్రదర్శిస్తున్న అతిథులు, విద్యార్థులు



విద్యార్థులకు కథలు చెబుతున్న గ్రంథాలయాధికారి నరసింహం తదితరులు

సబ్బవరం: విద్యార్థులంతా వేసవి సెలవుల్లో గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు తెలిపారు. సబ్బవరంలోని మండల శాఖ గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయనతో పాటు ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి ఎంజే రవీంద్రబాబు, రిటైర్డ్ వ్యవసాయ అధికారి రత్నకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వి.శిరీష మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రోజుకో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరం ఈ నెల 28 నుంచి మే 6 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమం ప్రారంభమైంది. గ్రంథాలయ స్థలదాత దాసరి సన్యాసిశెట్టి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మే 6 వరకు జరిగే కార్యక్రమాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, కార్మిక నాయకుడు సీహెచ్ సూర్యనారాయణరాజు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు లోవబాబు, న్యాయవాది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి నరసింహం మాట్లాడుతూ 40 రోజుల పాటు జరిగే ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులకు కథలు చెప్పడం, చదివించడం, నేరి్పంచడం, సృజనాత్మక అంశాలు, క్రీడలు, ఆటలు, పాటలు, నృత్యాలు, విద్య, ఆరోగ్యం, విజ్ఞాన కార్యక్రమాలపై శిక్షణ, పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి



ఫెడరేషన్ సమావేశాలను ప్రారంభిస్తున్న బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ జాతీయ ఇన్‌చార్జ్ పాండే

ఉక్కునగరం: దేశంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కృషి చేస్తోందని బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ ఇన్‌చార్జి డీకే పాండే స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం (స్టీల్‌ప్లాంట్)లోని అంబేడ్కర్ కళాక్షేత్రంలో బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ 17వ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల ముగింపు సందర్భంగా పలు ముఖ్యమైన తీర్మానాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో యాజమాన్యం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న విధానాలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ , కంపల్సరీ రిటైర్‌మెంట్ స్కీమ్‌లను రద్దు చేయాలని కోరారు. అలాగే, కార్మికుల జీతాలు మరియు ఇతర అలవెన్సులు సక్రమంగా చెల్లించాలని, గతంలో నిలిపివేసిన ఇంటి అద్దె భత్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని వారు తీర్మానించారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే వేతన ఒప్పందం అమలు చేయాలని, కర్మాగారం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎంఎస్ జాతీయ సహ సంఘటనా మంత్రి గణేష్ మిశ్రా, జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు, స్టీల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, రాష్ట్ర బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్. నాయుడు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక



సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: వాళ్లందరూ పూర్వ విద్యార్థులు.. చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 2010–2011లో పదో తరగతి చదువుకున్నారు. వారంతా రీ యూనియన్, రివైండ్, రిలివ్, రీకనెక్ట్ పేరుతో మండలంలోని ఇండస్ట్రియల్ పార్కు, వైవా ఫంక్షన్ హాల్లో సోమవారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాజీ కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి, ఉదయ నాగశ్రీ దంపతులు పూర్వ విద్యార్థులతో కలిసి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరు గురించి ఒకరు తెలుసుకున్నారు. సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.